నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. త్రిషూల్ ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి 12.30 వరకు త్రిషుల్ విల్లాస్, అపర్ణ త్రిలోక్, సాతంరాయి గ్రామ ఫీడర్‌లో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు సుచిత్ర ఇండియా విల్లాస్, సాతంరాయి గ్రామం, పాశం బండా తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

పారా ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో నేత్ర విద్యార్థినికి బంగారు పతకం



పవర్ లిఫ్టింగ్ పోటీలో హంసిక

శంషాబాద్‌రూరల్: ఇండియన్ బ్లైండ్ స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి పారా ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని నేత్ర విద్యాలయం విద్యార్థిని హంసిక బంగారు పతకం సాధించింది. ముచ్చింతల్ శివారులో శ్రీరామనగరంలో శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో కొనసాగుతున్న నేత్ర విద్యాలయం నుంచి ఈ పోటీలకు హాజరైన హంసిక సత్తా చాటింది. కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో ఈ నెల 21, 22 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించారు.

రసవత్తరంగా శ్రీరాంనగర్ ఎన్నికల పోరు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్(సెక్రటేరియట్ కాలనీ) సంక్షేమ సంఘం ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అధ్యక్ష స్థానానికి పి.అంబేడ్కర్, కె. శివరామ్‌రెడ్డి, కె.సూర్యనారాయణరెడ్డి, వి.వెంకటేశ్వరరావు బరిలో మిగిలారు. ఉపాధ్యక్ష పదవులు మూడు ఉండగా దానికి ఎ.కృష్ణారావు, ఎం.కుమారరత్నం, కె.నవీన్, ఆర్.రవి, బి.శివరామకృష్ణ పోటీలో ఉన్నారు. కోశాధికారి పదవి ఒకటి ఉండగా అనితాదేవి మహేంద్ర, జె.మాధవరావు, పీబీ శ్రీకాంత్ పోటీ పడుతున్నారు. మిగతా అన్ని పదవులు ఏకగ్రీవం అయ్యాయి. కార్యవర్గంలో కీలకమైన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి పదవులు కీలకం కావడం, వాటికి ఎక్కువ మంది పోటీలో ఉండటంతో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 29వ తేదీన జరిగే ఎన్నికల్లో 300 మంది సభ్యులు పాల్గొననున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు డి.శంకర్, లత, ఆశజ్యోతి, అల్లాహ్వాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల దోపిడీని ఆపాలి



ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనివాస్ తదితరులు

శంషాబాద్: నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. టెక్నో, గ్రామర్, ఒలంపియాడ్‌ల పేరుతో ప్రైవేటు స్కూళ్లు భారీగా ఫీజులు దండుకుంటున్నాయని అన్నారు. స్కూళ్లలో అక్రమంగా విక్రయిస్తున్న పుస్తకాలు, యునిఫాంలపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని స్కూళ్లపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రమేష్‌గౌడ్, యాదగిరి తదితరులున్నారు.

బోనాలకు సర్వం సిద్ధం..!

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- తొలిబోనం గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు
- లంగర్‌హౌస్‌లో సమర్పించనున్న మంత్రులు



గోల్కొండ కోటపై అమ్మవారి ప్రధాన ఆలయం



చోటాబజార్ పూజారి ఇంటి వద్ద (ఫైల్)

లంగర్‌హౌస్: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలోనే ప్రారంభమై, చివరి బోనాలు కూడా ఇక్కడే ముగించడం ఆచారం. గోల్కొండ కోటపై జగదాంబికా అమ్మవారికి మొదటి పూజ నిర్వహించి నెల రోజుల పాటు ప్రతి గురు, ఆదివారాల్లో 9 పూజలు నిర్వహిస్తారు. శతాబ్దాలుగా లంగర్‌హౌస్ వాసుల చేతుల మీదుగా బోనాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల జాతరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ కోటపై అమ్మవారి ఆలయం వరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. భక్తులు కూడా అధికారులకు సహకరించి అమ్మవారిని దర్శించుకోవాలి.

–కొండెపుడి చంటిబాబు (గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ చైర్మన్)

నజర్ బోనం, భారీ తొట్టెలతో బోనాలు

గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ప్రథమ పూజతో బోనాల సంబరాలు ప్రారంభమవుతాయి. మొదటి పూజలో భాగంగా నజర్ బోనం సమర్పించనున్నారు. 32 అడుగుల ఎత్తైన భారీ తొట్టెలను కూడా సమర్పించనున్నారు. ఈనెల 25న లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి భారీ ఊరేగింపుతో గోల్కొండ కోటకు పట్టు వస్త్రాలు, కల్లు సాక, తొట్టెలు తీసుకెళ్లనున్నారు.

ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు

ప్రభుత్వం తరఫున గమంత్రులు లంగర్‌హౌస్‌లో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఊరేగింపును ప్రారంభిస్తారు. చోటాబజార్‌లోని ప్రధాన పూజారి ఇంట్లో పూజలు చేసి అక్కడి నుంచి బోనాలతో అమ్మవారిని పల్లకీలో ఊరేగించి కోటపై కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించడంతో మొదటి పూజ ముగియనున్నది. అమ్మవారిని నగలతో అలంకరించి, తొలిబోనం సమర్పిస్తారు.

తొలి బోనం విశిష్టత

లంగర్‌హౌస్‌ను గతంలో లంగర్‌ఖానా అని పిలిచేవారు. లంగర్ అనగా వంట ఖానా అనగా గది. ఈ ప్రాంతంలో నాడు వంట గదులు ఉండేవి కావు. ఆహార ధాన్యాలను ఇక్కడి బాండారాల్లో దాచి రాజులకు, సైనికులకు ఆహారాన్ని లంగర్‌హౌస్‌లోనే వండి పంపించేవారు. అమ్మవారి నైవేద్యాన్ని కూడా ఇక్కడి నుంచే వండి పంపించడంతో బోనాలను లంగర్‌హౌస్ వాసులు నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతోంది.

సామూహిక బోనాల సమర్పణ

మొదటి బోనం తర్వాత భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించే రోజుకు మరో ప్రత్యేకత ఉంది. జూలై 6 న సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. నగరంలోని ప్రధాన దేవాలయాలు అయిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, మిరాలంమండీ అమ్మవారు, లాల్‌దర్వాజ అమ్మవార్లతో పాటు పలు ఆలయాల నుంచి దాదాపు 100కు పైగా తొట్టెలను సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. వీరంతా తమ తొట్టెలు, బోనాలను జూలై 10 న ఉదయం 11 గంటలకు లంగర్‌హౌస్‌కు తీసుకురానున్నారు. ఇక్కడి నుంచి సామూహిక ఊరేగింపుగా గోల్కొండ కోటపైకి సాగనుంది.

అమ్మవారి తొమ్మిది పూజలు

- గురువారం మొదటి బోనం సమర్పించనుండగా ప్రతి ఆది, గురువారాల్లో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించనున్నారు.
- జూలై 6 న నాలుగో పూజ సందర్భంగా జంట నగరాల్లోని ప్రముఖ ఆలయాల నుంచి లంగర్‌హౌస్‌కు తొట్టెలు ఊరేగింపులు చేరుకొని, అక్కడ నుంచి గోల్కొండ కోటకు సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు.
- జూలై 10న ఐదో పూజ సందర్భంగా కోటపై అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమం నిర్వహిస్తారు.
- 13 న ఆరో పూజను పురస్కరించుకొని శాఖంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నారు.
- 17న ఏడో పూజ సందర్భంగా కోటపై అమ్మవారికి పల్లకీ సేవ, మాతాకీ జాగరణ కార్యక్రమాలు ఉంటాయి.
- 24న చివరి పూజ సందర్భంగా అమ్మవారికి సమారోహణ కుంబార్తి, గావు, పని వృత్తి వార్లతో సమాప్తి పూజా కార్యక్రమాలు ఉంటాయి.

రంగారెడ్డి జిల్లా రైతులకు రైతుభరోసా అందించాలి

బీఆర్‌ఎస్ నాయకుడు కార్తిక్‌రెడ్డి



మణికొండ: రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రైతు భరోసా అందజేసి రంగారెడ్డి జిల్లాలో ఔటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న రైతులకు ఇవ్వకపోవడం వారిని అవమానించినట్టేనని, బుధవారం సాయంత్రంలోపు వారి అకౌంట్లలో డబ్బులు వేయకపోతే జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తిక్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో రాష్ట్ర ఆదాయానికి రంగారెడ్డి జిల్లా వెన్నెముక అని, జిల్లా రైతులు ఎన్నో త్యాగాలు చేస్తే రాష్ట్రానికి ఆర్థిక వనరులు వస్తున్నాయన్నారు. అలాంటి రైతులను అవమానించడం, వారిని రెండవ స్థాయి పౌరులుగా చూడటం పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ తప్పును తెలుసుకుని బుధవారం సాయంత్రంలోపు జిల్లాలోని ప్రతి రైతుకు రైతుభరోసా డబ్బులను చెల్లించాలన్నారు. లేదంటే అవి చెల్లించే వరకు తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ఆయన హెచ్చరించారు.

ఓ పక్క మొక్కలు నాటుతూ.. మరో పక్క కట్ చేస్తూ..

రాజేంద్రనగర్: ఒక పక్క ప్రభుత్వం మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుతుంటే.. అవి పెరిగి విద్యుత్ వైర్లకు తాగుతున్నాయని అధికారులు వాటిని కట్ చేయిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పీడీపీ చౌరస్తా నుంచి శివరాంపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా గతంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ మొక్కలను నాటింది. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ చెట్ల కొమ్మలతో విద్యుత్ వైర్లకు ఆటంకం ఏర్పడుతోందన్న ఆలోచనతో విద్యుత్ విభాగం సిబ్బంది ప్రస్తుతం చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో నిన్నటి వరకు పచ్చదనంతో కళకళలాడిన చెట్లు నేడు కళాహీనంగా కనిపిస్తున్నాయి.



చెట్లను నరికివేయడంతో కళాహీనంగా తయారైన ప్రాంతం

దేవాలయం భూముల కౌలు వేలం



దేవాలయం భూమి కౌలు రషీదును అందజేస్తున్న ఆలయ అధికారులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల, మల్కారంలో ఉన్న చేవెళ్ల శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూములకు మంగళవారం కౌలు వేలం పాట నిర్వహించారు. మల్కారంలో సర్వే నంబర్–13లో ఉన్న ఎకరా 35 గుంటల భూమిని స్థానికుడు శ్రీరాములు వేలం పాటలో కౌలుకు తీసుకున్నాడు. ఈ మేరకు ఆలయ అధికారులు కౌలు రషీదును అందజేశారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

అత్తాపూర్: గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించడంలో సహకరించాల్సి అవసరం ఉందని అత్తాపూర్ అగర్వాల్ సేవా దళ్ హెల్త్ క్యాంపియన్ గౌరవ అధ్యక్షుడు మనీష్‌అగర్వాల్ తెలిపారు. 30 సంవత్సరాలుగా ఆకలితో అలమటిస్తున్న పేదలకు అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు భోజన సదుపాయాలతో పాటు పలురకాల సేవలు చేయడం బాధ్యతగా తీసుకున్నామన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది ప్రజలను ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

27 నుంచి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

గోల్కొండ: మెహిదీపట్నం పరిసర ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీని ఆర్టీసీ ప్రారంభించిందని మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న మెహిదీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సు ఉదయం 5 గంటలకు ములుగు జిల్లా రామప్ప దేవాలయం, ములుగు కోట గుళ్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వెయ్యి స్తంభాల గుడి వరంగల్ జిల్లా, భద్రకాళి ఆలయానికి బయలుదేరుతుందని పేర్కొన్నారు. టికెట్ పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.650 ఉంటుందని తెలిపారు. ఇది కేవలం టికెటు రేట్ మాత్రమే అని ఆలయ దర్శన టికెట్లు, టీ, టిఫిన్, భోజన ఖర్చులు ప్రయాణికులే చెల్లించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకే కాలనీ నుంచి 35–40 ప్రయాణికులు ఉంటే బస్సు నేరుగా కాలనీకే వస్తుందని, మరిన్ని వివరాలకు 9959226133, 9493345129, 7075050005 లలో సంప్రదించాలని ఆయన సూచించారు.


గోల్కొండ బోనాల ఉత్సవ సమితి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ




ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కనకయ్య

అత్తాపూర్: తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ రూపొందించిన ఆహ్వాన పత్రికను మంగళవారం అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ పార్కులో ఆవిష్కరించారు. తెలంగాణ కుమ్మర సంఘం, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నేదునూరి కనకయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్‌కుమార్, కాకులారం శంకర్, బ్రహ్మయ్యనాయుడు, యోగా సెంటర్ ప్రతినిధి మిట్టపల్లి నర్సింహరావు, వాకర్ అసోసియేషన్ ప్రతినిధి బుచ్చయ్య, పర్యావరణవేత్త తిమ్మారెడ్డి, ఉత్సవ సమితి కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ద్విచక్రవాహన దొంగల అరెస్టు



అమెర్



మహమ్మద్ సల్మాన్

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డుపై పార్కు చేసిన బైకులను చోరీ చేసిన యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ మార్కెట్‌లో సోమవారం ఉదయం ఓ వ్యక్తి బైక్‌ను పక్కన పార్కింగ్ చేసి కూరగాయలు కొన్నాడు. తర్వాత బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవ్యక్తి తన ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి పడుకున్నాడు. ఉదయం వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్సూద్ అలీ రంగంలోకి దిగి సీసీ పుటేజీ ఆధారంగా ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు మహమ్మద్ అమెర్ పాషా(19), మహమ్మద్ సల్మాన్(19)ని అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరగా అందుబాటులోకి తేవాలి



అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

మైలార్‌దేవ్‌పల్లి: అసంపూర్తిగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు త్వరితగతిన పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. చార్మినార్ జోన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్‌కు వాటర్ కనెక్షన్ కోసం జలమండలి అధికారులకు కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. వాటర్ కనెక్షన్, షటిల్ బ్యాడ్మింటన్ ఆట స్థలం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన వెంటనే స్పోర్ట్స్ సెక్షన్‌కు హ్యాండ్ ఓవర్ చేయాలన్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్‌సీ మహేశ్వర్‌రెడ్డి, సీఈ రత్నాకర్, ప్రాజెక్ట్ ఈఈ కేఎల్.శ్రీనివాస్, రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ జి.కిష్టయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాంతినగర్ వాసులు సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. వీలైనంత త్వరగా నూతన ఎస్టిమేషన్ తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులకు అనుసంధానం చేస్తూ మిగిలి ఉన్న పనులను సాంక్షన్‌కి పంపించాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సిబ్బంది వినయ్, రమేష్, కైలాష్, అడికే శివ, మొహమ్మద్ షకీల్, భాస్కర్, శివ, ఉజ్వల్, రిషి, సైనీ, పవన్, నిర్మల్, రాంనివాస్, రామ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



మార్కండేయనగర్ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి: సీసీ కెమెరాలతో నేరగాళ్లను పసిగట్టవచ్చని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్, మార్కండేయనగర్ కాలనీలోని దేవాలయాల్లో సీసీ కెమెరాలను మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో స్వచ్ఛందంగా కాలనీ అసోసియేషన్, దేవాలయ కమిటీలు ముందుకు వచ్చి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వచ్ఛందంగా కెమెరాలను ఏర్పాటు చేసుకున్న వారిని ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ పొలిటికల్ వింగ్ రాష్ట్ర కన్వీనర్‌గా శివచారి



నియామకపత్రం అందుకుంటున్న శివచారి

మైలార్‌దేవ్‌పల్లి: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ పొలిటికల్ వింగ్ రాష్ట్ర కన్వీనర్‌గా శివచారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యువత తరఫున విశ్వకర్మ యువ యాత్ర పేరుతో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు బైక్ యాత్ర నిర్వహించామన్నారు. ఈ యాత్ర ద్వారా విశ్వకర్మ జాతికి ఐక్యత, పరస్పర స్నేహం, సామాజిక అవగాహన కల్పించాలనే సంకల్పంతో నిర్వహించామన్నారు. శ్రీశైలం విశ్వబ్రాహ్మణ సంఘంలో నిర్వహించిన సమావేశంలో తనను విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర పొలిటికల్ వింగ్ కన్వీనర్‌గా నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ అండ్ ఫౌండేర్ విశ్వనాథుల పుష్పగిరి, యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు కూరెళ్ల శివరామ్‌కు ధన్యావాదాలు తెలిపారు.

మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న యువకుడి అరెస్టు



రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని డీటీఎఫ్ శంషాబాద్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, ఒక సెల్‌ఫోన్, ఒక బజాజ్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన వట్టి జగదీశ్వరరెడ్డి అలియాస్ జగదీష్(25) బెంగుళూర్‌కు చెందిన డ్రగ్స్ ప్రధాన సరఫరా దారుడు సైఫ్ షరీఫ్ వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మైలార్‌దేవ్‌పల్లిలో డీటీఎఫ్ శంషాబాద్ బృందం దాడులు నిర్వహించి జగదీష్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యం, ఒక సెల్‌ఫోన్, ఒక బజాజ్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రేపు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి అమర్లపురి వందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో టెలీకాలర్ తదితర 50 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ, బీకాం, కంప్యూటర్ సైన్స్ విద్యార్హతతో పాటు 18 ఏళ్లు పైబడిన వారు అర్హులు. ఎంపికైన వారికి విద్యార్హత, అనుభవాన్ని అనుసరించి ఆకర్షణీయమైన జీతభత్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఉదయం 11 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు సర్టిఫికెట్లతో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 8328428933 నబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచితంగా డేటా ఇంజినీరింగ్ కోర్సు

అబిడ్స్: సత్యసాయి సేవా సంస్థ, సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–2025 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, లేదా ఎంసీఏ పూర్తిచేసిన పట్టభద్రులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్.క్యూ.ఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్ లో ఆఫ్‌లైన్‌లో తరగతులు ఉంటాయని తెలిపారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 90523 72023 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.